
సాక్షి
నిజామాబాద్
గురువారం । 1 । జూన్ । 2023



వీసీని తొలగించండి

తెయూ వీసీని తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేశారు.

- 8లో ▸



నిందితుల కోసం వేట

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో నిందితులను పట్టుకునేందుకు రెండు పోలీసు బృందాలు రాజస్థాన్, జార్ఖండ్ వెళ్లాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.7 /28.3

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం మేఘావృతం అవుతుంది. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

గోనె సంచుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం



వర్ని: వర్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకొని గోనె సంచులు కాలిపోయాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో గోడౌన్‌లో ఉన్న సుమారు రూ.20 లక్షల విలువైన సంచులు దగ్ధమైనట్లు సొసైటీ అధ్యక్షుడు సాయిబాబా తెలిపారు. సహకార సంఘానికి చెందిన గోడౌన్‌ను సురేష్ అనే వ్యక్తికి లీజుకు ఇవ్వగా సదరు వ్యక్తి అందులో గోనెసంచులను నిల్వ ఉంచాడు. బుధవారం సాయంత్రం గోడౌన్ పక్కన వ్యవసాయదారుడు గడ్డికి నిప్పు పెట్టగా గోడౌన్ వెంటిలేషన్ నుంచి నిప్పు లోపలికి వచ్చి సంచులు కాలిపోయినట్లు సాయిబాబా చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పి వేశారు.

ట్రస్టు సేవలు అభినందనీయం



పెర్కిట్(ఆర్మూర్): పొద్దుటూరి సదానంద్ రెడ్డి ట్రస్టు ద్వారా అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారులో పొద్దుటూరి సదానంద్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అనాథాశ్రమాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న సదానంద్ రెడ్డి ట్రస్టు వారు అనాథ బాలల కోసం అన్ని వసతులతో అనాథాశ్రమాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. అనాథ బాలలకు ఆశ్రయం కల్పిస్తున్న ట్రస్టుకు జిల్లా యంత్రాంగం తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సదానంద్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాన్వాయ్‌లో ఢీకొన్న వాహనాలు



ఆర్మూర్‌టౌన్: ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పలు శుభకార్యాలకు వెలుతుండగా ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్‌గార్డెన్ సమీపంలో ఎమ్మెల్యే కాన్వాయ్‌లో అనుచరుల వాహనలు ఒకదాని ఒకటి ఢీకొని ముగ్గురికి గాయాలైయ్యాయి. చైర్‌పర్సన్ వాహనానికి వైస్‌చైర్మన్ వాహన, వైస్‌చైర్మన్ వాహనానికి కౌన్సిలర్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కాలు విరిగింది. కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, సుంకరి రంగన్నకు స్వల్ప గాయాలైయ్యాయి.

ఎమ్మెల్యే ఘటన స్థలానికి చేరుకుని సమీప ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కాలు విరగడంతో మైరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కౌన్సిలర్ వాహనానికి బెలున్స్ బయటకు రావడంతో పెద్ద ప్రమాదం నుంచి గంగామోహన్‌చక్రు, రంగన్న బయటపడ్డారు.

నేటి నుంచి తెయూ వర్సిటీకి సెలవులు

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్ (డిచ్‌పల్లి), సౌత్‌క్యాంపస్ (భిక్కనూర్), ఎడ్యుకేషన్ క్యాంపస్ (సారంగపూర్) కళాశాలల విద్యార్థులకు జూన్ 1 నుంచి 9వరకు సెలవులు ప్రకటిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు హాస్టల్స్ ఖాళీ చేయాలని, ఈ సెలవు దినాల్లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తారని వీసీ తెలిపారు. ఆయా క్యాంపస్‌లోని బాలురు, బాలికల వసతి గృహాలకు మరమ్మతు పనులు ఉన్నందున సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. కాగా వీసీ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిస్తారనే భయంతోనే సెలవులు ప్రకటించారని పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ మెంబర్ బి.శివ బుధవారం రాత్రి వేర్వేరు ప్రకటనలో ఆరోపించారు.

తవ్వినకొద్దీ

ఆర్థిక అక్రమాలు

- తెయూలో బయటపడుతున్న విచ్చలవిడి చెల్లింపులు
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో రూ.లక్షల్లో జమ.. వెంటనే డ్రా.. తర్వాత వీసీ జేబులోకి.. !
- క్రీడాకారుల ఎంపికల పేరిటా ఇష్టారీతిన ఖర్చు
- వర్సిటీకి సంబంధం లేని సుశ్రుత్‌రెడ్డి పేరునా భారీగానే..



తెలంగాణ యూనివర్సిటీలో ఆర్థిక అక్రమాలను పరిశీలిస్తే ఎవరికైనా విస్మయం కలగక మానదు. వివిధ బిల్లుల చెల్లింపుల పేరిట వర్సిటీ నిధులు మొదట అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లోకి.. ఆ వెనువెంటనే డ్రా.. ఇలా రూ.లక్షల్లో డబ్బులను సొంతానికి దండుకున్నారు. దీని వెనుక వర్సిటీ అత్యున్నత అధికారి సూత్రధారి కావడం అసలు రహస్యం..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి తవ్వినకొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వైస్ చాన్సలర్ రవీందర్‌గుప్తా నగదు దండుకునే విషయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో ఇష్టం వచ్చినట్లు పెద్దమొత్తంలో డబ్బులు జమ చేయించి.. సదరు నగదును నిమిషాల వ్యవధిలోనే ఆయా ఉద్యోగులతో డ్రా చేయించి తన జేబు నింపుకున్న వ్యవహారాలు విస్మయం కలిగిస్తున్నాయి. అదేవిధంగా వివిధ క్రీడలకు సంబంధించి క్రీడాకారుల ఎంపికల విషయంలో కూడా విచ్చలవిడిగా ఖర్చు చేయడం గమనార్హం. పాలకమండలి నియమించిన కమిటీ విచారణలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అకడమిక్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌కు ఎరియర్స్ పేరిట రూ.10 లక్షలు చెల్లించడంతో, శ్రీనివాస్‌ను సర్వీసు నుంచి తొలగించాలని పాలకమండలి తీర్మానం చేసింది. ఇదిలా ఉండగా మరిన్ని వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. అసలు వర్సిటీతో సంబంధం లేని సుశ్రుత్‌రెడ్డి అనే వ్యక్తి పేరిట రూ.3,18,500 జమ చేయడం గమనార్హం. క్రీడాకారుల ఎంపిక పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగుల ఖాతాల్లో ఇష్టం వచ్చినట్లు జమ చేశారు. ఒక ఉద్యోగి ఖాతాలో రూ.2,62,750, మరోసారి రూ.2,13,650 జమ చేశారు. ఓ కేర్‌టేకర్ ఖాతాలో సాధారణ ఖర్చులకు రూ.1,07,000, ఓ జూనియర్ అసిస్టెంట్ ఖాతాలో రూ.3,79,500, మరో జూనియర్ అసిస్టెంట్ ఖాతాలో రూ.2లక్షలు, మరో ఉద్యోగి ఖాతాలో బతుకమ్మ పండుగ పేరిట రూ.30వేలు, మరో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఖాతాలో పెయింటింగ్ వర్క్ పేరిట రూ.రూ.90 వేలు, వివిధ సెలబ్రేషన్స్ కోసం మరో కేర్ టేకర్ ఖాతాలో రూ.1,89,500, క్రీడా పోటీల పేరిట ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ పేరిట రూ.2,41,000 జమ చేయడం విశేషం. గత రెండేళ్లుగా ఈసీ ఆమోదం కోసం బడ్జెట్ అందజేయని నేపథ్యంలోనూ బడ్జెట్ ప్రిపరేషన్ పేరిట ఒక ఉద్యోగి ఖాతాలో డబ్బులు జమ చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే పలువురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో రూ.40వేల నుంచి రూ.50వేలు ఆ పైన అనేక సార్లు డబ్బులు జమ చేసి వారి వద్ద నుంచి తక్షణమే వసూలు చేయించిన వ్యవహారాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇక కొందరు ఉద్యోగుల ఖాతాల్లో మాత్రం రూ.9,500 నుంచి రూ.25వేల మధ్య పలు సార్లు డబ్బులు జమ చేసి వారి వద్ద నుంచి వసూలు చేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.



హరిదా రచయితల సంఘం మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖిల్లా జైలులో దాశరథి మైనపు విగ్రహం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని చారిత్రక ఖిల్లా జైలులో దాశరథి కృష్ణమాచార్య మైనపు విగ్రహంతో పాటు రాతి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. మైనపు విగ్రహం జైలు గోడలపై బొగ్గుతో రాస్తున్నట్లుగా ఉంటుందన్నారు. జూలై 22న ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. దాశరథిని బంధిస్తే జైలు గోడలపై బొగ్గుతో ఆయన నిజాం ప్రభువును ఎదురిస్తూ రచనలు రాశారన్నారు. ఆయన మాటలు మొత్తం తెలంగాణ ఉద్యమానికి బాట చూపాయన్నారు. నిజామాబాద్ నగరంలో బుధవారం నిర్వహించిన హరిదా రచయితల సంఘం 5వ మహాసభలో కవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఎమ్మెల్సీ నిధులు రూ.40 లక్షలతో ఖిల్లా జైలు ప్రాంతాన్ని పర్యా టక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఒకప్పుడు తెలంగాణలో కవులకు సరైన గుర్తింపు ఉండేది కాదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కవులు, కళాకారులకు తగినంత గుర్తింపు, ప్రో త్సాహాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో అద్భుతమైన సాహితీవేత్తల సంపద తరాలుగా ఉందన్నారు. సాహిత్య సంస్థలను ప్రోత్సహించేందుకు కళాపోషకులు ముందుకు రావాలన్నారు. ఇటీవల ఢిల్లీలో ఒక ఆడపిల్లల ను నరికి చంపుతున్నా అక్కడ ఉన్న వారు స్పందించకపోవటం విచారకరమన్నారు.

బ్రిజ్ భూషణ్ పై చర్యలేవీ ?

నిజామాబాద్‌నాగారం : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. ఆమె బుధవారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ గత కొంతకాలంగా దేశ రాజధానిలో రెజ్లర్లు వివిధ రూపాల్లో నిరసనలు ఆందోళనలు తెలుపుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రెజ్లర్లు లేవనెత్తుతున్న అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన పరిష్కారం చూపాలని డిమాండ్‌చేశారు. కష్టపడి, నిబద్ధతత, దేశభక్తితో మహిళా రెజ్లర్లు ప్రపంచానికి భారత దేశ ప్రతిభను కనబరిచారని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం రెజ్లర్ల సమస్యల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పోక్సో వంటి తీవ్ర మైన అభియోగాలు ఉన్నప్పటికీ నిందితుడు బయట తిరుగుతున్నాడని, బాధితులకు న్యాయాన్ని నిరాకరించరాదని అన్నారు. దేశా నికి బంగారు పతకాలు సాధించిన మహిళ క్రీడాకారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. ఈ వ్యవహారాన్ని మొత్తం ప్రపంచమంతా చూస్తోందని, దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానాన్ని కోరుకుంటున్నారని అన్నారు.

రీ డిజైన్ రద్దుకు మద్దతు తెలపండి

- బండి సంజయ్‌ని కలిసిన 'మంచిప్ప' నిర్వాసితులు



బండి సంజయ్‌ని కలిసిన ముంపు నిర్వాసితులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కాళేశ్వరం ప్రాజెక్ట్ లోభాగంగా 21, 22వ ప్యాకేజీలను పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని, రీ డిజైన్ రద్దుకు మంచిప్ప ముంపు నిర్వాసితుల కమిటీ చేపడుతున్న ఉద్యమానికి మద్దతు పలకాలని నిర్వాసితులు, కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం నగరానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం, కమిటీ సభ్యులపై నమోదు చేసిన అక్రమ కేసుల గురించి బండి సంజయ్‌కి వివరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మంచిప్ప రిజర్వాయర్ వల్ల 8 తండాలు, 2 గ్రామ పంచాయతీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్ట్ రీ డిజైన్ వల్ల గిరిజన కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నాయని, రీ డిజైన్ రద్దు, పాత డిజైన్‌కు మద్దతు తెలపాలని కోరారు. గ్రామాన్ని సందర్శించి ప్రజలకు ధైర్యమిచ్చి అండగా నిలవాలని విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ త్వరలోనే మంచిప్ప ముంపు ప్రాంతానికి వస్తానని హామీనిచ్చారని వారు తెలిపారు. సంజయ్‌ని కలిసిన వారిలో కమిటీ సభ్యులు తూర్పు రాజేష్, భాస్కర్, సత్యనారాయణ, మహేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఏసీడీ చార్జీల మోత

- గృహ వినియోగదారులకు నోటీసులు
- విద్యుత్‌లోడ్ ఆధారంగా రూ.3వేల నుంచి రూ.5వేల వరకు భారం



మోర్తాడ్ (బాల్కొండ): సాధారణ లోడ్ కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నందున రూ.3,108 డిపాజిట్ చేయాలని మోర్తాడ్‌లోని గోవిందరెడ్డి కాలనీలో ఇందిరమ్మ ఇంట్లో నివాసం ఉంటున్న లక్ష్మికి ఎన్పీడీసీఎల్ అధికారులు నోటీసు జారీ చేశారు. అలాగే పాలెంలో ఇందూరు ఆదిత్యకు కూడా సాధారణం కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నారని రూ.2,464 డిపాజిట్ పెంచాలని నోటీసులు జారీ చేశారు. ఇది ఒక్క లక్ష్మి, ఆదిత్యల ఇండ్లకే కాదు జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది గృహ వినియోగదారులు, వ్యాపార సంస్థల యజమానులకు అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నందుకు డిపాజిట్(ఏసీడీ) చెల్లించాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్పీడీసీఎల్) సంస్థ నోటీసులను జారీ చేస్తోంది. గతంలో వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలకే పరిమితమైన ఏసీడీ చార్జీల వసూలు ఇప్పుడు గృహ వినియోగదారులకు విస్తరించింది.

విద్యుత్ కనెక్షన్‌లు తీసుకున్న సమయంలో తక్కువ లోడ్‌కు డిపాజిట్ చెల్లించారని ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు ఇతర విద్యుత్ ఆధారిత సామగ్రి వినియోగం వల్ల లోడ్ పెరిగిందని ఎన్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. లోడ్ పెరగడాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించినట్లు ఉన్నతాధికారులు వివరించారు. గతంలో ఏసీడీ చార్జీల వసూళ్లపై వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అదనపు చార్జీల వసూలు పై సంస్థ వెనక్కితగ్గింది. పరిస్థితి సద్దుమణగడంతో మళ్లీ ఏసీడీ చార్జీలను వసూలు చేయాలని ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. గృహ వినియోగదారుల నుంచి రూ.3వేలు మొదలుకొని రూ.5వేల వరకు ఏసీడీ చార్జీలను వసూలు చేస్తున్నారు. దీనిపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సంస్థ ఎప్పుడు ఏదో ఒక రూపంలో అదనంగా చార్జీలు వసూలు చేస్తూ తమ జేబులను గుల్ల చేస్తుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో 24,361 మందికి ..

నిర్ణీత లోడ్‌కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న వివిధ కేటగిరిలను గుర్తించి 24,361 మంది వినియోగదారులకు నోటీసులను జారీ చేశారు. ఇందులో గృహ వినియోగదారులు 6,954 మంది కాగా కేటగిరి 2, 3, 4, 6,7,8లకు సంబంధించి 17,407 మంది వినియోగదారులకు ఏసీడీ చార్జీలు చెల్లించాలని నోటీసులు అందాయి. ఏసీడీ చార్జీలను ఈనెల 5లోగా ఎన్పీడీసీఎల్ సంస్థకు జమ చేయాల్సి ఉంది.

ఇది సెక్యూరిటీ డిపాజిట్ మాత్రమే..

ఏసీడీ చార్జీలు కేవలం సెక్యూరిటీ డిపాజిట్‌లుగానే వసూలు చేస్తున్నాం. వినియోగదారులు కనెక్షన్‌ను ఉపసంహరించుకునే సమయంలో డిపాజిట్ సొమ్మును వాపసు చేస్తాం. ఉన్న లోడ్‌కు అదనంగా లోడ్ వినియోగించడం వల్లనే ఏసీడీ చార్జీలు వసూలు చేస్తున్నాం.


– వినోద్, ఏడీఈ, భీమ్‌గల్, మోర్తాడ్ సబ్ డివిజన్లు

వడ్ల పైసలు జమ చేస్తలేరు..



ఏర్గట్ల కొనుగోలు కేంద్రంలో వడ్లు ఎండబోస్తున్న రైతులు

- ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో వేస్తామన్న ప్రభుత్వం
- పక్షం రోజులు గడుస్తున్నా రైతులకు సొమ్ము చెల్లించని వైనం
- జిల్లా రైతాంగానికి రూ.260 కోట్ల వరకు బకాయిలు



మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని పాలెంకు చెందిన కుంట రవిశంకర్ అనే రైతు సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో 64 క్వింటాళ్ల వరి ధా న్యంను విక్రయించాడు. అతని ఖాతాలో రూ.1,31,840 జమ కావాల్సి ఉంది. ధాన్యం అన్ లోడింగ్ తరువాత సదరు రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ నంబర్ వచ్చి పదిహేను రోజులైతున్నా సొ మ్ము జమ కావడం లేదు. వర్షాకాలం పంటలకు పెట్టుబడుల కోసం రైతు రవిశంకర్ ధాన్యం సొమ్ముపైనే ఆధారపడ్డాడు. ఇది ఒక్క రైతు రవిశంకర్‌కు ఎదురైన ఇబ్బందే కాదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన ఎంతో మంది రైతులకు సకాలంలో డబ్బులు చేతికి అందక ఇబ్బందులు కలుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం పదే పదే చెబుతుంది. ఆచరణలో మాత్రం 48 గంటల మాట దేవుడెరుగు వారం, పదిహేను రోజులైతున్నా ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావడం లేదు. వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేయకపోవడంతో రైతుల చేతికి సొమ్ము అందడంలో జాప్యం కలుగుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు 5.65లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు సాగాయి. మరింత ధాన్యంను కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించాల్సి ఉంది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.480 కోట్లు జమ చేశారు. ఇంకా రూ.260 కోట్లు జమ కావాల్సి ఉండగా పదిహేను రోజుల నుంచి సాంకేతిక కారణాలతో ధాన్యం సొమ్ము జమ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ధాన్యం విక్రయాలు ఏప్రిల్ నెలలోనే మొదలైనా రైతుల ఖాతాలకు ఈనెలలోనే సొమ్ము జమైంది. వరి ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినా విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఒకటి, రెండు రోజుల్లో సొమ్ము జమ చేస్తాం..

ధాన్యం సొమ్ము జమ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. రూ.260 కోట్లు ఒకటి, రెండు రోజుల్లో జమ చేస్తాం. ధాన్యం అన్‌లోడింగ్ జరుగగానే రైతులకు ఓటీపీ నంబర్ వస్తుంది. అనివార్య కారణాల వల్లనే ధాన్యం జమ చేయడంలో జాప్యం అవుతుంది.

– జగదీష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

వడదెబ్బతో విద్యార్థిని మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన
- కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఘటన



లావణ్య (ఫైల్)

కామారెడ్డి టౌన్ : వడదెబ్బ సోకి చికిత్స పొందుతూ 15 ఏళ్ల విద్యార్థిని మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. క్యాసంపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నాజు–నీలా దంపతుల పెద్ద కూతురు లావణ్యకు వాంతులు, తీవ్ర జ్వరం రావడంతో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం లావణ్య ఆరోగ్యం విషమంగా ఉందని వైద్యులు రాజధానికి తీసుకెళ్లాలని చెప్పారు. ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందిందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో బంధువులు మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చి ధర్నాకు దిగారు. సీఐ నరేష్ వారిని సముదాయించారు. ఆర్‌ఎంవో శ్రీ నివాస్ మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు. లావణ్యకు మెదడులో రక్తం గడ్డ కట్టిందన్నారు.

కొత్త సీపీ వచ్చేదెప్పుడో..

- రెణ్నెళ్లుగా పోస్టు ఖాళీ
- ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకే నియామకంలో జాప్యం
- నిర్మల్ ఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు
- ఇద్దరి పేర్లను వేర్వేరుగా ప్రతిపాదించిన ఇద్దరు ప్రజాప్రతినిధులు



ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టు ఖాళీ అయి రెండు నెలలు గడుస్తున్నా నియామకం జరగడం లేదు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడమే కారణంగా విమర్శలు వస్తున్నాయి. పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కేఆర్ నాగరాజు పదవీ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు నెలలుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ పోలీసు కమిషనర్ నియామకానికి జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు వేర్వేరుగా ఇద్దరు పేర్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఒకరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన పోలీస్ అధికారిని, మరొకరు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారిని నియమించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇద్దరు బలమైన ప్రజాప్రతినిధులు ప్రపొజల్స్ పంపడంతో పోలీస్ ఉన్నతాధికారులు తలలు పట్టుకున్నట్లు సమాచారం. ఎన్నికల గడువు సమీపించడంతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా వ్యవహరించే కమిషనర్ కావాలని జిల్లాలోని ప్రధాన ప్రజాప్రతినిధులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాలో ఎస్సై, సీఐ తదితర పోస్టులకు సదరు ప్రజాప్రతినిధుల సిఫార్సుల లేఖలు లేనిదే పోలీస్‌స్టేషన్‌లలో పోస్టులు భర్తీ కావడంలేదనే చర్చ పోలీస్‌శాఖలో సాగుతోంది. ఇప్పుడు వచ్చే పోలీస్‌కమిషనర్ రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉండే సీపీ ఉంటే బాగుంటుందని చర్చించినట్లు తెలిసింది. దీంతో కొత్త కొత్వాల్ కోసం మల్లాగుల్లాలు పడుతున్నట్లు సామాచారం. ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు చేసిన వారిని కాకుండా సీఎంవోలో పని చేస్తున్న పోలీస్ ఉన్నతాధికారి పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో సదరు ఐపీఎస్ అధికారి నిజామాబాద్ సీపీ పోస్టు కోసం ప్రయత్నం చేసినప్పటికీ కేఆర్ నాగరాజుకు అవకాశం లభించినట్లు తెలిసింది. దీంతో మరోసారి సదరు ఐపీఎస్ అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు పోలీసు వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇదిలా ఉండగా పోలీస్‌స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారులకు చెప్పుకుందామంటే అవకాశం లేకుండా పోయిందని పలువురు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక


నంద శ్రీనిధి

భిక్కనూరు: దుబాయిలో వచ్చే నెలలో జరుగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు భిక్కనూరుకు చెందిన నంద శ్రీనిధి బుధవారం ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో నిర్వహించిన ఇండియా – నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీనిధి ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది.

పొగాకుకు దూరంగా ఉండాలి



నిజామాబాద్ సిటీ: యువత పొగాకు, మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. పొగాకుకు అలవాటు పడిన వారు డి అడిక్షన్ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు. సతీష్ షాహు, డాక్టర్ విశాల్ ఆకుల, కటకం శ్రీనివాస్, రాజ్‌కుమార్ సుబేదార్, శ్రీనివాసరావు, పార్శి రాజేశ్వర్, సుధీర్ గుప్తా, పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

పొగాకుతో వ్యాపించే వ్యాధుల్ని అరికడదాం



నిజామాబాద్ సిటీ: పొగాకు వల్ల వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు కృషి చేయాలని డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక వినాయక్‌నగర్ ఆరోగ్య కేంద్ర పరిధిలో పొగాకు నివారణ దినోత్సవ ర్యాలీను డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రవితేజ మాట్లాడుతూ పొగాకుకు అలవాటు పడిన వ్యక్తులను కౌన్సెలింగ్ చేసి మాన్పించేలా చూడాలన్నారు. వైద్యులు శ్రీకాంత్, బీఎస్ రెడ్డి, శ్రీలత, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, ఎన్సీడీ కోఆర్డినేటర్ వెంకటేశం, హెల్త్ సూపర్‌వైజర్లు మధుకర్ పాల్గొన్నారు.

శాబ్దిపూర్‌లో గుడిసె దగ్ధం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నాయిని రాజనర్సవ్వ గుడిసెకు గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారని చెప్పారు. ప్రమాదంలో గుడిసెలో ఉన్న గేదెకు గాయాలు కాగా, ఎడ్ల బండి, కట్టెలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

సాహిత్యానికి సమాజాన్ని మార్చే శక్తి

- హరిదా రచయితల సంఘం కార్యక్రమాలు రాష్ట్రమంతా విస్తరించాలి
- ఎమ్మెల్సీ కవిత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్‌సిటీ: సమాజ ఆలోచనను మార్చే శక్తి సాహిత్యానికి ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డులో గల లహరి హోటల్‌లో హరిదా రచయితల సంఘం 5వ మహాసభ సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు తెలంగాణలో కవులకు సరైన గుర్తింపు ఉండేది కాదని, రాష్ట్రం ఏర్పడ్డాక కవులను, కళాకారులకు తగినంత గుర్తింపు, ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అద్భుతమైన సాహితీవేత్తల సంపద తరాలుగా ఉందన్నారు. సాహిత్య సంస్థలను ప్రోత్సహించేందుకు కళా పోషకులు ముందుకు రావాలన్నారు. హరిదా రచయితల కార్యక్రమాలు ప్రస్తుతం జిల్లాకే పరిమితం అయ్యాయని, ఇవి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్నారు. హరిదా కార్యక్రమాలు కొనసాగించేందుకు ఒక వేదిక అవసరమని, దాని కోసం తాను కృషి చేస్తానని ప్రకటించారు. ఇటీవల ఢిల్లీలో ఒక ఆడపిల్లను నరికి చంపుతున్న అక్కడ ఉన్న వారు స్పందించకపోవటం విచారకరమన్నారు.


సాహితీవేత్త, గేయ రచయిత నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బిగాల

సీఎం కేసీఆర్ మంచి కవి

ఉద్యమంలో ఉద్యమకారులు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేసి అలసిపోతే సీఎం కేసీఆర్ తన కవిత్వాలు, మాటలతో వారిలో ఉత్తేజం నింపేవారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11న కవి సమ్మేళనం ఉందని, దీనిని విజయవంతం చేసేందుకు కవులు, కళాకారులు కృషి చేయాలన్నారు. సినీ నటుడు, జబర్దస్త్ ఫేమ్ రచ్చ రవి మాట్లాడుతూ తనకు బాగా నచ్చిన కవి సీఎం కేసీఆర్ అన్నారు. సినిమాలోకి ప్రవేశించాక తాను మాట్లాడే భాషను కొంతమంది ఎగతాళి చేశారని, అదే భాష ఇప్పుడు బాగా పాపులర్ అయిందన్నారు. అనంతరం హరిదా ఆధ్వర్యంలో సామరస్య జీవనంలో సాహితీ వేత్తల పాత్రపై కవులు తమ కవితలను వినిపించారు.

కవులకు పురస్కారాల ప్రదానం

హరిదా మహాసభ సందర్భంగా తొమ్మిది మందికి ఎమ్మెల్సీ కవిత సరస్వతీ రాజ్ హరిదా సాహిత్యా పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో పంచరెడ్డి లక్ష్మణ్, పి మాధవి లత, త్రివేణి, నరాల సుధాకర్, రమేష్ కార్తీక్ నాయక్, క్లోం నవీన్‌రెడ్డి, మేక రామస్వామి, దారం గంగాధర్, తొగర్ల సురేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, సుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సుమ నారెడ్డి, సాంబారి మోహన్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, మాన్పూర్ భూమేష్, రాజేంద్రప్రసాద్, కాసర్ల నరేష్‌రావు, గంట్యాల ప్రసాద్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, జ్యోతి, గుత్ప ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెయూ వీసీని తొలగించాలని వినతి

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన డబ్బులను, ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసిన వీసీని వెంటనే తొలగించాలని యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్సీ కవితకు బుధవారం నిజామాబాద్ నగరంలోని పార్టీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. వీసీ నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకొని అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. గతంలో గర్ల్స్ హాస్టల్‌లో అమ్మాయిలతో చిందులు వేశారని, యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ మహిళా సిబ్బందిని వేధించిన్నట్లు ఆరోపించారు. యూనివర్సిటీని అక్రమార్కుల చెర నుంచి విడిపించాలని కోరారు. జన్నారపు రాజేశ్వర్, వి సంతోష్, లక్ష్మీనారాయణ, మోహన్, సాయితేజ, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తెయూ ప్రతిష్టను కాపాడాలని..

తెలంగాణ యూనివర్సిటీలో కొన్ని రోజుల నుంచి జరుగుతున్న వివాదాలకు స్వస్తి పలకాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షురాలు అంజలి బుధవారం ఎమ్మెల్సీ కవితకు విన్నవించారు. వీసీ రవీందర్ గుప్తా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి యూనివర్సిటీ ప్రతిష్టతను దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీసీ రవీందర్‌గుప్తా ఈసీ నిర్ణయాలను అమలు చేయకుండా సొంత నిర్ణయాలతో గతంలో 130 పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ యూనివర్సిటీ విషయాల్లో జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కుశాల్, వంశీ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం అందిస్తున్న యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు

విద్యుత్ సమస్యలు తీర్చడం లేదని లైన్‌మన్ నిర్బంధం



ఇందల్వాయి: గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహించిన నల్లవెల్లి గ్రామస్తులు బుధవారం జీపీ కార్యాలయంలో లైన్‌మన్‌ని నిర్బంధించారు. చిన్నపాటి గాలులు, వర్షానికే గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సమస్యని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వీడీసీ సభ్యులు తెలిపారు. తమ గ్రామానికి నిరంతరంగా 24 గంటల త్రీఫేస్ కరెంట్ సరఫరా అయ్యేలా అధికారులు పనులు చేపట్టాలని, అప్పటి వరకు బిల్లులు కట్టవద్దని గ్రామంలో తీర్మానం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో లైన్‌మన్‌ని వదిలిపెట్టారు. వీడీసీ అధ్యక్షుడు నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ సభ్యులు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న బైకులు

రాజంపేట: రెండు బైకులు ఆటోను ఢీకొన్న ఘటన బుధవారం రాజంపేట సాయిబాబా ఆలయం వద్ద చోటు చేసుకుంది. రాజంపేట నుంచి ప్రయాణికులతో ఆటో కామారెడ్డి వెళ్తోంది. బస్వన్నపల్లి గ్రామానికి చెందిన భూపతిరెడ్డి బైక్‌పై వెళ్తూ ఆటోను ఓవర్ టేక్ చేసే క్రమంలో దానిని ఢీకొన్నాడు. అదే దిశగా వస్తున్న మరో వాహనదారుడు సైతం ముందున్న బైకును ఢీకొట్టాడు. దీంతో భూపతిరెడ్డికి స్వల్ప గాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఐచర్‌ను ఢీకొన్న లారీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని సిద్దుల గుట్ట సమీపంలో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని లారీ ఢీకొంది. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వస్తున్న ఐచర్ వాహనం సిద్దుల గుట్ట సమీపంలో ఆగిపోయింది. మరమ్మతులు నిర్వహిస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో ఐచర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



తెయూలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు, సౌత్ క్యాంపస్‌లో..

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు వి దత్తహరి కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన చేపట్టారు. దత్తహరి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా చాలీ చాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు.

భిక్కనూరు: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ కోసం పోరాటం ఉధృతం చేస్తామని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. బుధవారం తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల కోసం వేట

- రాజస్థాన్, జార్ఖండ్ వెళ్లిన రెండు బృందాలు
- చోరీ చేసి హైదరాబాద్‌లో అమ్మినట్లు గుర్తింపు
- స్థానిక దొంగల సహకారంపై ఆరా

ఖలీల్‌వాడి/ఇందల్వాయి: ట్రాన్స్‌ఫార్మర్ దొంగల కోసం పోలీసుల వేటను ప్రారంభించారు. నిందితులను పట్టుకునే ప్రయత్నంలో ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపిన విషయం తెలిసిందే.. దొంగలను పట్టుకునేందుకు ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. నిందితుల్లో ఒకరు రాజస్థాన్ చెందిన వారు కాగా మరో ఇద్దరు జార్ఖండ్‌కు చెందిన వారుగా గుర్తించారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.

పోలీసుల నిర్లక్ష్యంతో తప్పించుకున్న దొంగలు

రాజస్థాన్, జార్ఖండ్ చెందిన అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా జిల్లాలోని ముప్కాల్ ప్రాంతంలో ప్రవేశించిందని పోలీసులకు సమాచారం ఆదివారం అందినట్లు సమాచారం. దీంతో పోలీసులు ముప్కాల్‌లో కాకుండా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పట్టుకునేందుకు అనువుగా ఉంటుందని భావించినట్లు తెలుస్తోంది. ధర్పల్లి, ఇందల్వాయి ఎస్సైలు వంశీ చందర్‌రెడ్డి, నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో తక్కువ సిబ్బంది ఉండటంతోపాటు దొంగలు తెచ్చిన కారును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోకపోవడంతోనే పారిపోయినట్లు తెలుస్తోంది.

కారు ద్వారా పట్టుకునేందుకు యత్నం

పోలీసులు రాజస్థాన్‌కు చెందిన ఆర్‌జె 29 సీబీ 5874 నంబర్ కారు ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు స్థానిక ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 150 నుంచి 200 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీ చేసిన కాపర్ కాయిల్స్‌ను హైదరాబాద్‌లో అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఎక్కడ అమ్మకాలు సాగించారో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

టోల్‌ప్లాజాలో పనిచేయని సీసీ కెమెరాలు

ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీసీ టీవీల్లో సమస్య ఉన్నట్లు అక్కడి సిబ్బంది ద్వారా తెలిసింది. కొంతకాలంగా సీసీ టీవీలు పని చేయడం లేదని అక్కడి సిబ్బంది చెప్పడం గమనార్హం. జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు తరుచు దొంగతనాలకు పాల్పడుతూ ఇందల్వాయి టోల్‌ప్లాజా మీదుగా వెళ్లినట్లు పోలీసులు గుర్తించిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి చోట సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఉన్నత విద్యకు 'దోస్త్'

- డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ
- రిజిస్ట్రేషన్‌లో సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్
- మూడు విడతల్లో సీట్ల కేటాయింపు


దోస్త్ ఆన్‌లైన్ పోర్టల్

బీబీపేట: అనేక రకాలైన కొలువులకు కనీస విద్యార్హత డిగ్రీ. అలాంటి డిగ్రీ విద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ అనే ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలను కల్పిస్తోంది. రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు వారికి ఇష్టం వచ్చిన కళాశాలలో చేరేలా దోస్త్ ద్వారా సాధ్యమవుతుంది. దీంతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనే విధానం మరింత సులువుగా ఉంటుంది. ప్రస్తుతం ఇంటర్ పూర్తయిన విద్యార్థులు దోస్త్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటే.. మెరిట్ ప్రకారం విద్యశాఖ సీట్లు కేటాయిస్తుంది.

దరఖాస్తు విధానం..

ఇంటర్ పూర్తయిన విద్యార్థులు https:// dost. cgg. gov. inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అంతకు ముందు విద్యార్థులు ఆధార్‌కార్డుకు వ్యక్తిగత ఫోన్ నంబర్ నమోదు చేసి ఉండాలి. దరఖాస్తుకు రూ.200 చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత విద్యార్థి దోస్త్ ఐడీ, పిన్ పొందుతారు. వీటి సాయంతో ఆన్‌లైన్‌లో ఏ కాలేజీలో చేరాలనుకుంటున్నారో కళాశాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. వీలైనన్ని ఎక్కువ కాలేజీల ఆప్షన్‌లు ఇవ్వాలి.

దోస్త్ షెడ్యూల్ ఇలా

మొదటి విడత

రిజిస్ట్రేషన్ : మే16 నుంచి జూన్ 10 వరకు
వెబ్ ఆప్షన్లు : మే 20 నుంచి జూన్ 11వరకు
సీట్ల కేటాయింపు : జూన్ 16న
సెల్ఫ్ రిపోర్టింగ్ : జూన్ 16 – జూన్ 25 వరకు

రెండో విడత

రిజిస్ట్రేషన్ : జూన్ 16 – 26 వరకు
వెబ్ ఆప్షన్లు : జూన్ 16 – 27 వరకు
సీట్ల కేటాయింపు : జూన్ 30న
సెల్ఫ్ రిపోర్టింగ్ : జూలై 01 నుంచి 05 వరకు

మూడో విడత

రిజిస్ట్రేషన్ : జూలై 01 – 05 వరకు
వెబ్ ఆప్షన్లు : జూలై 01 – 06 వరకు
సీట్ల కేటాయింపు : జూలై 10న
సెల్ఫ్ రిపోర్టింగ్ : జూలై 10 – జూలై 14 వరకు
తరగతులు ప్రారంభం : జూలై 17 నుంచి..

తెయూలో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందించాలి


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న వివాదాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి క్యాంపస్‌లో అకడమిక్ వాతావరం పెంపొందించాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెయూ పరిపాలనా భవనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం నరేందర్, కర్క గణేష్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు లావిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ.. తెయూలో రిజిస్ట్రార్ కేంద్రంగా జరుగుతున్న వివాదాల కారణంగా పరిపాలన గాడితప్పి అస్తవ్యస్తంగా మారిందన్నారు. వీసీ, ఈసీ, నవీన్‌మిట్టల్ విద్యార్థుల ప్రయోజనాలను గాలికొదిలేసి ఎవరికి వారు మొండిగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. 2017 నుంచి తెయూలో జరిగిన అన్ని రకాల నియమాకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖుర్, అనిల్, సంధ్య, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఈసీ సభ్యుల్లో ఎస్సీ, ఎస్టీలు ఎందుకు ఉండరు'


మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ మాదిగ

తెయూ(డిచ్‌పల్లి): స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దేశంలో ఎస్సీ, ఎస్టీలకు సరైన అవకాశాలు అందడం లేదని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ మాదిగ అన్నారు. బుధవారం తెయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసీ సభ్యుల్లో ఎస్సీ, ఎస్టీలు లేకపోతే వర్సిటీల్లో ఉండే ఎస్సీ, ఎస్టీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. వర్సిటీలో ప్రస్తుతం జరుగుతున్న ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి కమిషనర్ నవీన్ మిట్టల్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముందు ఈసీలో ముగ్గురు గౌడ కులస్తుల్లో ఇద్దరిని తొలగించి ఎస్సీ, ఎస్టీ సభ్యులను నియమించాలని, ఆ తర్వాత రిజిస్ట్రార్ గురించి మాట్లాడాలన్నారు. బి వెంకటరమణ, ఎం ఉదయ్ మాదిగ, అభినయ్ మాదిగ, సునీల్ మాదిగ, ప్రశాంత్ మాదిగ పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- 8 ద్విచక్ర వాహనాల స్వాధీనం


నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్పీ

కామారెడ్డి టౌన్: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తితో పాటు అతనికి సహకరిస్తున్న మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఓ ఆస్పత్రి వద్ద నాగుల రాజేందర్ బైక్ దొంగతనం కావడంతో గత నెల 24న కేసును నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం నిజాంసాగర్ చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన మహమ్మద్ రెహమాన్ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని విచారణ చేసినట్లు తెలిపారు. 9 ద్విచక్రవాహనాలను దొంగలించి అందులోని నాలుగింటిని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన భూమన్నగారి నర్సింలుకు విక్రయించడం కోసం ఇచ్చినట్లు రెహమాన్ ఒప్పుకున్నాడని చెప్పారు. వారి నుంచి ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు పంపామన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన కల్వరాల అశోక్ (47) కులాస్‌పూర్ చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. వివరాలు.. అశోక్ రోజులాగే ఆవుల గంగారాంతో కలిసి గ్రామానికి చెందిన గేదెలను మేపేందుకు వెళ్లారు. ఈక్రమంలో కులాస్‌పూర్ చెరువు వద్ద మేపుతుండగా, కొన్ని గేదెలు చెరువులోకి దిగాయి. వాటిని బయటికి పంపేందుకు సాయంత్రం 5 గంటల సమయంలో అశోక్ చెరువులోకి దిగాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరు..

తాడ్వాయి: లింగంపేట్ మండలం కోర్పోల్ గ్రామానికి చెందిన నర్సని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. స్వామి మంగళవారం కామారెడ్డి నుంచి వస్తుండగా తాడ్వాయిలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొన్నాడు. దీంతో స్వామి తలకు తీవ్రగాయాలు కాగా చికిత్సల నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వామి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా అక్కడ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. స్వామికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మృతుడి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఫుడ్ పాయిజన్‌తో ఆవుల మృతి

వర్ని: వర్నిలో ఫుడ్ పాయిజన్ అయి రెండు ఆవులు మృతి చెందినట్లు పశు వైద్యాధికారి సతీష్ వెల్లడించారు. హనుమాన్ మందిరానికి చెందిన ఆవులు శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తినడంతో జీర్ణం కాక ఫుడ్ పాయిజన్ అయి చనిపోయినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగంపేట: లింగంపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని కోమట్‌పల్లికి చెందిన అవుసుల భీమయ్య లింగంపేటకు పనుల నిమిత్తం వచ్చాడు. పనులు ముగించుకొని పెట్రోలు పోయించుకొని తిరిగి వస్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలోని మూల మలుపు వద్ద లారీ ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


సాయిలు (ఫైల్)

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువలో దూకి మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన కొమిరే సాయిలు(24) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. సాయిలు గతేడాది ఉపాధి కోసం కువైట్ వెళ్లి ఆరోగ్యం సరిగా లేక పోవడంతో తిరిగి ఇంటికి వచ్చాడు. గల్ఫ్ వెళ్లడానికి కొంత అప్పు అయింది. అప్పుల బాధ ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

గ్రామస్తుల రాస్తారోకో..

ఆత్మహత్య చేసుకున్న సాయిలు మృతదేహాన్ని వెలికి తీయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారంటు గ్రామస్తులు పాత జాతీయ రహదారిపై బుధవారం ఉదయం నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్‌సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే పోచంపాడ్ నుంచి గజ ఈతగాళ్లను తీసుకువచ్చి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ఎడపల్లి: మండలంలోని బాపునగర్ గ్రామానికి చెందిన కళావతి చందర్(57) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఠాణాకలాన్ శివారులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. అతని భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.